క్లుప్తంగా

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 27వ తేదీ శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యాముూల్ బుధవారం ప్రకటించారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అంతరాయం కలుగుతుందన్నారు. అంబేడ్కర్ నగర్, గోరక్షణపేట, ముగ్గుపేట, ఏసీవై రెడ్డి కాలనీ, శారదానగర్, తాడితోట, గాంధీపురం-3, దానవాయి పేట, శ్యామలానగర్, ఏవీ అప్పారావు రోడ్ ప్రాంతాలలో ప్రభావం ఉంటుందన్నారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

సీటీఆర్ఐ: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని, మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక బడా కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అప్పగించారని విమర్శించారు. కుండ్రపు రాంబాబు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నుంచి నరవ సస్పెన్షన్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 10వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నరవ గోపాలకృష్ణను పార్టీ నుంచి ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి తాను సంయుక్తంగా సస్పెండ్ చేసినట్లు ఉభయ గోదావరి జిల్లాల పార్టీ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్ బుధవారం ప్రకటించారు. మంగళవారం పదో డివిజన్ వీఎల్‌పురంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం సమయంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, ప్రజల సమక్షంలో సచివాలయ మహిళా సిబ్బంది పట్ల గోపాలకృష్ణ అనవసర వాగ్వాదానికి దిగాడని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రతిష్టతకు భంగం వాటిల్లే విధంగా ఉన్న అతని ప్రవర్తనను తీవ్రంగా పరిగణించి తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకూ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి

కంబాలచెరువు: ప్రతిభ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు విజయోభవ కార్యక్రమం బుధవారం జరిగింది. స్థానిక ఆనంద్ రీజెన్సీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడు గంప నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మస్థైర్యం పెంచుకుని మెరుగైన ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులంతా వినియోగించుకోవాలని ప్రతిభా విద్యాసంస్థల డైరెక్టర్ మూర్తి తెలిపారు.

మోదీ పాలనలో సంక్షేమం

రాజమహేంద్రవరం సిటీ: దేశంలో ప్రధాని మోదీ పాలన సంక్షేమమే లక్ష్యంగా సాగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. బుధవారం స్థానిక రివర్‌బే హోటల్‌లో జిల్లా స్థాయి బీజేపీ కార్యవర్గ సమావేశంలో కేంద్ర మంత్రి దేవుసిన్హ చౌహాన్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, వైఎస్సార్ సీపీలను ఓడించి అధికారం చేపట్టడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కేంద్రం సహాయంతోనే రాష్ట్రంలో అనేక పథకాలు అమలు అవుతున్నాయన్నారు.

27, 28 తేదీల్లో సీటీఆర్ఐలో సమావేశం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ)లో ఈ నెల 27, 28 తేదీలలో పొగాకుపై ఆల్‌ఇండియా నెట్‌వర్క్ ప్రాజెక్టు సమావేశం జరుగుతుంది. ఈ విషయాన్ని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషు మాధవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీఆర్ శర్మ, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌కే సింగ్, 80 మంది శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. ఈ పొగాకు పరిశోధన కార్యక్రమం ద్వారా ది నెట్‌వర్క్ కేంద్రాలు, ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్యల అధిగమించే అంశాలపై చర్చిస్తామన్నారు.

నేడు కళాకారుల ఆత్మీయ కలయిక

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ప్రకాష్‌నగర్ లేడీస్ క్లబ్‌లో గోదావరి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (జీఎంఏఏ) ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాకారుల ఆత్మీయ కలయిక కార్యక్రమం జరుగుతుందని కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. రిపబ్లిక్ డే సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ, అసోసియేషన్ లోగో ఆవిష్కరణ, ఐడెంటీ కార్డుల పంపిణీ, షార్ట్ ఫిల్మ్స్ రిలీజ్ తదితర కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.

అభివృద్ధి శూన్యం

సీటీఆర్ఐ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి జరగడం లేదని టీడీపీ సీనియర్ నేత ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఓటు హక్కు వజ్రాయుధం

రాజమహేంద్రవరం రూరల్: సమాజంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వాణికుమారి అన్నారు. బొమ్మూరులోని గురుకుల పాఠశాలలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఓటు హక్కు విలువను తెలుసుకున్నారు.

కడియం: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. పొట్టిలంకలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఓటు ప్రాధాన్యాన్ని వివరించారు. నిర్ణీత వయసు దాటిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్స


బొమ్మూరు గురుకుల పాఠశాలలో మాక్ పోలింగ్


పొట్టిలంకలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

వాన్ని నిర్వహించారు.

సంహిత కళాశాలలో..

కంబాలచెరువు: స్థానిక తాడితోట జంక్షన్ వద్ద ఉన్న సంహిత డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ మాట్లాడుతూ ఓటు చాలా విలువైందని, దీని ద్వారా మనం మంచి నాయకులను ఎన్నుకోవచ్చన్నారు. మనకు రాజ్యాంగం కల్పించిన అద్భుతమైన ఆయుధం ఓటు హక్కు అన్నారు. కళాశాల కల్చరల్ హెడ్ పల్లి సురేష్, ఎన్ఎస్ఎస్ పీవో, ఏవో జి.బాలకృష్ణ, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కంబాలచెరువు: స్థానిక శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద ఓటర్ల దినోత్సవాన్ని రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి మాట్లాడుతూ యువ ఓటర్లు ఎన్నికల్లో పాల్గొనే దిశగా 2011 జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రకటించారన్నారు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి బి.విజయభారత లక్ష్మి మాట్లాడుతూ యువత ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీబాయి, వీరలక్ష్మి, వెంకాయమ్మ, కుసుమ కామేశ్వరి, రాజేశ్వరి, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను తాకిన గంజాయి

- చాప కింద నీరులా వ్యాపారం
- అడ్డుకట్టకు పోలీసుల ప్రయత్నాలు

కడియం: గంజాయి వ్యాపారాన్ని చాప కింద నీరులా సాగిస్తున్నారు.. గుట్టుచప్పుడు కాకుండా గ్రామాలకూ విస్తరిస్తున్నారు.. కడియం మండలంలోనూ గంజాయి విక్రయాలు జరుగుతుండడం కలకలం రేపుతోంది. రాజమహేంద్రవరం, ధవళేశ్వరంలలో వినియోగం ఎక్కువగా ఉంటుందని భావించేవారు. అక్కడ పోలీసు యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరించడంతో గంజాయి విక్రయదారులు పక్క గ్రామాల బాట పట్టినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కడియం మండలం వేమగిరిలో తొలిసారిగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులు, ఒక మైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో అప్రమత్తమైన యంత్రాంగం గ్రామాలను జల్లెడ పడుతోంది. అమ్మకందారులు, వినియోగించే వ్యక్తులపై నిఘా పెట్టింది. పలువురు అనుమానితులను ఆరా తీస్తోంది. గతంలో కడియం కెనాల్ రోడ్డు, వేమగిరి వద్ద జాతీయ రహదారిపై రవాణా చేస్తున్న గంజాయిని కడియం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే గ్రామాల్లో అమ్ముతున్న వారిని


వేమగిరిలో గంజాయి విక్రేతల నుంచి సమాచారం రాబడుతున్న కడియం పోలీసులు (ఫైల్)

అరెస్టు చేయడం ఇదే ప్రథమం.

వీళ్లే టార్గెట్..

తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆదరణ లేని యువకులనే గంజాయి ముఠాలు టార్గెట్ చేస్తున్నాయి. ఇటువంటి వారికి డబ్బు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బైక్‌ల ఆశ చూపించి గంజాయి అమ్మకాలకు పురికొల్పుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా సరదా పార్టీల పేరిట కొత్తగా యువకులకు గంజాయి అలవాటు చేసేందుకు కూడా వల పన్నుతున్నట్లు తెలుస్తోంది. ఇలా అభం శుభం తెలియని యువతను గంజాయికి బానిసలుగా చేస్తున్నారంటున్నారు. ప్రస్తుతం తీగ లాగుతున్న పోలీసు యంత్రాంగం వేగంగా చర్యలకు సిద్ధమవుతోంది. గంజాయి మత్తులో మండలంలోని పలు గ్రామాల్లో కొందరు గొడవలకు దిగుతున్నారు. పిల్లల ప్రవర్తన, వారి స్నేహితులు, వ్యవహారాలపై తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. ఎక్కడికి వెళుతున్నారు? ఎవరితో తిరుగుతున్నారు? వంటి వాటిని గుర్తించి, ఒకవేళ చెడు మార్గం పడుతుంటే వారిని కట్టడి చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందంటున్నారు. లేకపోతే భవిష్యత్తుల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హితవు పలుకుతున్నారు.

సమాచారం తెలపండి

మండలంలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలను రహస్యంగా ఉంచుతాం. గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని ఇప్పటికే అరెస్టు చేశాం. వారికి ఎక్కడి నుంచి గంజాయి వస్తుందనే దానిపై కూడా లోతైన విచారణ చేపట్టాం. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి.

– పీవీజీ తిలక్, కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్

1 నుంచి బ్రహ్మోత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు గ్రామంలోని శ్రీవల్లభ గణపతి మందిరం, శ్రీపంచముఖ ఆంజనేయ ఉపాలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి ఒకటి నుంచి మూడో తేదీ వరకు జరుగుతాయి. ఆలయ వ్యవస్థాపకులు సామవేదం షణ్ముఖశర్మ ఈ ఉత్సవాలలో స్వయంగా పాల్గొంటారు. మూడో తేదీ సాయంత్రం 6 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన స్వానంద నిలయం భవనంలో సామవేదం రచించిన శివపదం గీతాలను చెన్నైకు చెందిన శ్రీరంగం వి.వెంకటనాగరాజన్ గానం చేస్తారు. సామవేదం షణ్ముఖశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

మాధవ్‌కు అభినందన

ప్రకాశంనగర్: కాంగ్రెస్ పార్టీ ఏపీ కంట్రోల్ రూమ్ రాష్ట్ర ఇన్‌చార్జిగా ముళ్ల మాధవ్‌ను నియమించడంపై బుధవారం స్థానికంగా ఆయన నివాసంలో ఆ పార్టీ, దళిత సంఘాల నాయకులు కలసి అభినందించారు. రాహుల్ గాంధీ చేస్తున్న భారత్ జోడో యాత్ర ఈ నెల 30న కాశ్మీర్‌లో ముగియనున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాలలో 26 నుంచి 'హాత్ సే హాత్ జోడో అభియాన్' కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు విజయవాడలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఆంధ్ర రత్నభవన్‌లో జోడో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ బాధ్యతలు నిర్వహించడానికి మాధవ్‌ను నియమించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రకాశంనగర్: సూరత్ డుమస్ బీచ్‌లో ఈ నెల 26 నుంచి 30 వరకు జరిగే హీరో నేషనల్ బీచ్ ఫుట్‌బాల్ చాంపియన్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు సభ్యుడిగా రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి మహంతి లోకేష్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి సుంకర నాగేంద్రకిశోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీరా గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోకేష్ గతంలో అండర్-14 రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ, జాతీయ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

బ్యాంక్ ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: డిమాండ్లు పరిష్కరించపోతే ఈ నెల 30, 31వ తేదీల్లో దేశ వ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగుల సమ్మె తప్పదని యూఎఫ్‌బీఐ నాయకుడు లక్ష్మీపతిరావు ప్రకటించారు. బుధవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇన్నీసుపేట వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ మేనేజ్‌మెంట్ మధ్య సెంట్రల్ లేబర్ కమిషనర్ ఏర్పాటు చేసిన మీటింగ్ విఫలమైనందున రెండు రోజుల సమ్మె అనివార్యమైందన్నారు. ఈ నెల 27న తిరిగి సెంట్రల్ లేబర్ కమిషనర్ మరో సమావేశం జరగనుందని, తమ డిమాండ్లు పరిష్కరించే దిశగా ప్రయత్నం చేయపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. నాయకులు పాపారావు, ఎం.శ్రీనివాస్, ప్రసాద్, గాలి శ్రీనివాస్, చంద్రశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గబాబుకు జిల్లా స్థాయి అవార్డు


కె.దుర్గబాబు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు కె.దుర్గబాబుకు జిల్లా స్థాయిలో రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా అవార్డు లభించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో రైతులకు వివిధ సేవలను రైతు భరోసా కేంద్రం ద్వారా అందించడంలో దుర్గబాబు ఉత్తమ ఫలితాలు కనబర్చారని గురువారం గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో అవార్డు అందజేస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయనకు అవార్డు లభించడం పట్ల రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘ అధ్యక్షుడు వేణుమాధవరావు, సంఘ ప్రచార కార్యదర్శి పీటర్, వ్యవసాయాధికారి భీమరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

నిషేధం దారుణం

రాజమహేంద్రవరం సిటీ: ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా ఫ్లెక్సీల నిషేధం అమలు చేయడం దారుణమని రాజమహేంద్రవరం ఫ్లెక్స్, ప్రింటింగ్ ఓనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు వీరభద్రరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం చెప్పినట్టు క్లాత్ వాడాలంటే ఇప్పుడున్న మెషీన్లు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఇందుకు అవసరమైన రుణాలు మంజూరు చేసి అప్‌గ్రేడ్ అయ్యేవరకూ గడువు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, రాజా, మహేష్, రాజారమేష్, మాణిక్యం, మణికంఠ, రాజశేఖర్, రాము, ప్రశాంత్, అంజనీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కంబాలచెరువు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ, జల పరిరక్షణపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలతో నీరు, నేల కలుషితమవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. న్యాయవాది జి.కృష్ణ కపూర్ మాట్లాడుతూ చెట్లను సంబంధిత అధికారుల అనుమతి లేకుండా నరకరాదన్నారు. డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ బి.లూసి కార్డోలియా, జిల్లా అటవీ సంరక్షణ అధికారి బి.నాగరాజు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా అటవీ సంరక్షణ అధికారి ఎంవీ ప్రసాదరావు, డీటీవో కేఎస్ కృష్ణారావు, కోనసీమ జిల్లా డిప్యూటీ తహసీల్దార్ టీవీఎస్ రమాదేవి, డీపీటీవో డి.విజయలక్ష్మి పాల్గొన్నారు. కం


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూషకుమారి

దుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ పర్యాటక దినోత్సవం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి, హిస్టరీ విభాగాధిపతి ఎమ్.వెంకయ్యమ్మ, ఎకనామిక్స్ లెక్చరర్ సీవీ రామలక్ష్మి పాల్గొన్నారు.

నిరాహార దీక్షతోనే స్పందన

రాజమహేంద్రవరం సిటీ: పేపరుమిల్లు వ్యర్థాల కాలుష్యం నుంచి గోదావరిని కాపాడాలని చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్ష ఫలితాన్ని ఇచ్చిందని, చర్యల గురించి అధికారులను ప్రధానమంత్రి కార్యాలయం నివేదిక కోరిందని గోదావరి పరిరక్షణ సమితి చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరిని కాలుష్యం బారి నుంచి కాపాడాలని దీక్ష చేస్తున్న సమయంలోనే ప్రధానమంత్రి కార్యాలయానికి పంపించిన వినతి పత్రంపై తాజాగా స్పందన వచ్చిందన్నారు. కాలుష్యం నుంచి కాపాడడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారో నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని పీఎం కార్యాలయం ఏపీ ప్రభుత్వ సీఎస్‌కి లేఖ పంపిందన్నారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ నమామి గోదావరి స్కీమ్‌లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటార


సమావేశంలో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

న్నారు. గోదావరిలో వ్యర్థాలు కలవకుండా చర్యలు చేపట్టే వరకూ పోరాడుతూనే ఉంటామన్నారు. పేపరుమిల్లు ఇక్కడే ఉండాలని, కాలుష్యం నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమితి జనరల్ సెక్రటరీ కానుబోయిన సాగర్, ఉపాధ్యక్షుడు బర్రే కొండబాబు, కోశాధికారి సుబ్బరాజు, సభ్యులు పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత సీఎం జగన్‌దే

సీతానగరం: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ మూడున్నరేళ్లలో నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం రఘుదేవపురంలో వివిధ పార్టీలకు చెందిన 30 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన గేదెల కుమార్, చౌదరి సుబ్బారావు, నాతి రాము ఆధ్వర్యంలో తలబలలోవరాజు, కోరుమిల్లి శ్రీను, తోట వీరబాబు, తోట కృష్ణలతో పాటు 30 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు యువత ఆకర్షితులవుతున్నారని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలకు వైఎస్సార్ సీపీలో తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గెద్దాడ త్రిమూర్తులు, దాసరి బాబి, యలమాటి కాశీ, పిండి రాధాకృష్ణ, పైడి రాజు, పంతుల శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రఘుదేవపురంలో వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఇదిలాఉంటే మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల పలు కారణాలతో మరణించిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కాటవరంలో పార్టీ కోకన్వీనర్ తండ్రి పట్టాభి రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాపాకలో పిచ్చుకుల రవికుమార్ తండ్రి ప్రథమ సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొన్నారు. వంగలపూడిలో పలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. చినకొండేపూడిలో అడ్వకేట్ క్రొవ్విడి కృష్ణమూర్తి ఇటీవల బైపాస్ సర్జరీ చేసుకోగా అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు, పార్టీలో చేరికల కమిటీ చైర్మన్ గద్దె వెంకటకృష్ణచౌదరి (నల్లి), మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, చల్లమళ్ల సుజీరాజు తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రకాశంనగర్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 23, 24 తేదీల్లో కాకినాడ ఐడియల్ కళాశాలలో జరిగిన మహిళల హ్యాండ్‌బాల్ పోటీలలో ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థినులు రన్నర్స్‌గా నిలిచారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలను అధ్యాపకులు, ఇతర సిబ్బంది అభినందించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు: స్థానిక సుబ్బారావునగర్‌కు చెందిన పాత నేరస్తుడు సేనాపతిరాజు (26) ఉరి వేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాజు గతంలో గంజాయి తాగుతూ పలు అసాంఘిక కార్యక్రమాలు చేస్తుండేవాడు. మంగళవారం రాత్రి ఫుల్‌గా మద్యం తాగి వచ్చి పడుకున్నాడు. మర్నాడు ఉదయం ఎంత సమయం అయినా తలుపులు తీయడం లేదని వెళ్లి బంధువులు చూస్తే ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించాడు. దీనిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి స్వాధీనం: నలుగురి అరెస్ట్


గంజాయి, నిందితులతో రెండో పట్టణ సీఐ గణేష్, పోలీసు సిబ్బంది

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గంజాయితో నలుగురిని రెండో పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. రెండో పట్టణ సీఐ టి.గణేష్ కథనం ప్రకారం.. స్థానిక ఇన్నీసుపేటలోని వీటీ కళాశాలలో కొందరు గంజాయి కలిగి ఉన్నారని సమాచారం వచ్చింది. వెంటనే ఆ ప్రాంతంలో సీఐ తన సిబ్బందితో దాడి చేసి సంపత్‌నగర్‌కు చెందిన యళ్లా కాళీకృష్ణ, శంభూనగర్‌కు చెందిన వంజరపు పెద్దిరాములు, ఏసీ గార్డెన్స్‌కు చెందిన రాజపుజిత దుర్గాప్రసాద్, బాలాజీపేటకు చెందిన గుడవర్తి మణికంఠలను పట్టుకున్నారు. వారి నుంచి 24 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, రూ.400 స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

టిడ్కో గృహాల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం పంచాయతీ పరిధిలోని ప్రధానమంత్రి ఆవాజ్ యోజనలో నిర్మించిన టిడ్కో గృహాలను బుధవారం సాయంత్రం కేంద్రమంత్రి దేవుసిన్హ చౌహాన్ సందర్శించారు. బీజేపీ తూర్పుగోదావరి జిల్లా ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా కేంద్ర నిధులతో నిర్మించిన పీఎంఏవై గృహాలను ఆయన సందర్శించి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, ప్రవాస యోజన జిల్లా కన్వీనర్ కురగంట సతీష్, నల్లా పవన్‌కుమార్, కాలెపు సత్యసాయిరామ్ పాల్గొన్నారు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి దేవుసిన్హ చౌహాన్

మహిళ అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక ఏవీ రోడ్డులో నివాసముంటున్న నాగమణి (60) అదృశ్యమైన సంఘటనపై ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఆమె కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తన తల్లి ఈ నెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదని ప్రసాద్ పేర్కొన్నాడు.